క్లుప్తంగా

రేపటి నుంచి రైల్వే గేట్ మూసివేత

సంగెం : రేపటి నుంచి ఈనెల 15వ తేదీ వరకు మండలంలోని చింతలపల్లి-ఎల్గూర్ రైల్వే స్టేషన్ల మధ్యలో 391/5-7 రైల్వే గేట్ మూసివేయనున్నట్లు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ గేదెల శివాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రం నుంచి వరంగల్‌కు వెళ్లే 67వ నంబర్ చింతలపల్లి రైల్వే లేవల్ క్రాసింగ్ మరమ్మతుల నేపథ్యంలో మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈదారి మీదుగా రాకపోకలు సాగించే వాహనదార్లు, ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని కోరారు.

బీమా నగదు అందజేత



సంగెం : మండలంలోని గవిచర్లకు చెందిన శ్రీ రామలింగేశ్వర పురుషుల పొదుపు సంఘం సభ్యుడు సూత్రపు సదయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబానికి శ్రీ ఆంజనేయ పురుషుల పొదుపు సమితి అధ్యక్షుడు గుండబోయిన ఎల్లగౌడ్ కార్యాలయంలో సోమవారం రూ.2 లక్షల ప్రమాద బీమా డబ్బు అందజేశారు. అనంతరం ఎల్లగౌడ్ మాట్లాడారు. ప్రతిఒక్కరూ సంపాదనలో కొంత పొదుపు చేసుకోవాలని, బీమా కలిగి ఉండాలని సూచించారు. సదయ్య ప్రమాదంలో మృతి చెందగా అతడి భార్య స్వరూప, కుమారుడు రఘుకు బీమా డబ్బు రూ.2 లక్షలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు అనుమాండ్ల జనార్దన్, బాషిపాక సదయ్య, ఉమేందర్, దేవేందర్, శ్రీనివాస్, బాలరాజు, రమేశ్, రాములు, సుమన్, నాగరాజు, కోశాధికారి శీలం మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ బాటిళ్ల పంపిణీ



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని జల్లి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు జగన్‌మోహన్ మిత్రుడు వంగేటి రక్షిత్ సమకూర్చిన సుమారు రూ.3,500 విలువైన వాటర్ బాటిళ్ల ఆ స్కూల్ విద్యార్థులకు ఎంఈఓ బైరి సరళ సోమవారం పంపిణీ చేశారు. ఉపాధ్యాయురాలు పద్మ విద్యార్థులకు పులిహోర, పాయసం అందించారు. అలాగే ఆలింకో సహకారంతో విద్యార్థులకు టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు జగన్‌మోహన్ పద్మతోపాటు జగన్‌మోహన్ స్నేహితుడు రక్షిత్‌ను ఎంఈఓ అభినందించారు.

కార్యవర్గం ఎన్నిక

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలో జమీయతుల్ ఉల్మా హింద్ మండల కమిటీని రాష్ట్ర ట్రెజరర్ మౌలానా అబ్దుల్ సత్తార్, జిల్లా అధ్యక్షుడు మౌలానా అబ్దుల్ అజీమ్, వరంగల్ సిటీ అధ్యక్షుడు హఫీజ్ ముజాహిద్ బిలాల్ అఫ్జల్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మౌలానా అబ్దుల్ గఫూర్, ఉపాధ్యక్షుడుగా మౌలానా సైపుల్లా, ప్రధాన కార్యదర్శిగా హఫీజ్ మహ్మద్ నజీర్, జాయింట్ సెక్రటరీగా షైక్ అబ్దుల్ అజీజ్ ఖజాంచి, షైక్ అన్వర్ పాషా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీని అభినందించారు.

'గ్రీన్ ఫీల్డ్' బాధితులకు పరిహారం ఇవ్వాలి

పర్వతగిరి : గ్రీన్ ఫీల్డ్ హైవే బాధిత రైతులకు పరిహారం ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధిత రైతులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రదీప్‌రావు మాట్లాడారు. గ్రీన్ ఫీల్డ్ హైవే బాధిత రైతులంతా చిన్న కారు రైతులని, భూమిపైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కర్నె రవీందర్, బాధిత రైతులు రాంచందర్, నల్లపు దేవేందర్, రాములు, భిక్షపతి, అజిత్ పాషా, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత తీర్చాలి

నర్సంపేట/ఖానాపురం : నర్సంపేట, ఖానాపురం మండలాల్లో యూరియా కొరతను తక్షణమే తీర్చాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నర్సంపేట డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో బృందం ఆయా తహసీల్దార్లకు సోమవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం రాజు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు అవసరమైన మేరకు యూరియా అందించడం లేదన్నారు. నామమాత్రంగా సరఫరా చేస్తుండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం యూరియా తెప్పించడంలో విఫలమైందన్నారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో రైతు సంఘం డివిజన్ అధ్యక్షుడు కొమురయ్య, నాయకులు కట్టయ్య, స్వామి, జవహర్‌లాల్, రంజిత్, వెంకటయ్య, రవి, రమేశ్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల రహదారి గుంతలమయం

● రాత్రివేళల్లో ప్రమాదాలు

ఖానాపురం : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ నుంచి రాగంపేట, కొత్తూరు, రంగాపురం గ్రామాలకు వెళ్లే రహదరి గుంతలమయమైంది. నిత్యం వందలాదిగా ప్రజలు, వాహనాలు రాకపోకలు సాగించే ఈ దారిలో భారీ లోతుతో గుంతలపడడంతో రాత్రివేళల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అయినా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదంటూ సదరు గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.
మండలంలోని రాగంపేట, కొత్తూరు, రంగాపురం గ్రామాల ప్రజలు, విద్యార్థులు, రైతులు మండల కేంద్రానికి అవసరాల నిమిత్తం పోలీస్‌స్టేషన్ దారిలో ప్రయాణం సాగించడం పరిపాటి. ఆటోలు, ద్విచక్ర వాహనాలు, సైకిళ్ల మాత్రమే కాకుండా భారీ వాహనాలు సైతం రాకపోకలు సాగిస్తాయి. ఈ రోడ్డు గుంతలు పడి అధ్వానంగా తయారు కావడంతో ప్రయాణం సాగించాలంటే జనం బెంబేలెత్తుఉన్నారు. రోడ్డు మీదున్న గుంతల కారణంగా ఆర్టీసీ బస్సు కూడా నడవని దుస్థితి నెలకొందని అయా గ్రామాల ప్రజలు వాపోయారు. గత ప్రభుత్వ హాయంలో రహదారి నిర్మాణానికి రూ.1.65 కోట్లు మంజూరు చేయగా ఎన్నికలకు ముందు టెండర్ ప్రకియ చేపట్టగా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సదరు నిధులను రద్దు చేయగా ఏడాది క్రితం అధికారులు మరోసారి ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఇప్పటివరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సత్వరమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



ఖానాపురం-రంగాపురం వెళ్లే రోడ్డులో గుంతలు

మూడు గ్రామాలకు ఒకే రోడ్డు

మండల కేంద్రం నుంచి మూడు గ్రామాలకు ఒకే రోడ్డు ఉంది. అది కాగా గుంతలమయం కావడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పలువురు గాయాల పాలయ్యారు. ప్రభుత్వం సత్వరమే రోడ్డు నిర్మింపజేయాలి లేదా తాత్కాలిక మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలి.

- బంధారపు శ్రీనివాస్, రంగాపురం

టెండరు పూర్తి కాగానే పనులు

గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్లు టెండర్ వేయకపోవడంతో రద్దయ్యాయి. మళ్లీ ప్రతిపాదనలు పంపడంతో ప్రభుత్వం రోడ్డు మంజూరు చేసింది. టెండరు ప్రక్రియ పూర్తి కాగానే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్డు నిర్మింపజేస్తాం.

- మణితేజరెడ్డి, ఏఈ, పీఆర్

గిర్నిబావిని ఎంపీటీసీ స్థానంగా గుర్తించాలి



ఎంపీడీఓ అరుంధతికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

● అఖిలపక్షాల ఏకగ్రీవ తీర్మానం

దుగ్గొండి : మండలంలోని తొగర్రాయి ఎంపీటీసీ పరిధి ఎక్కువగా ఉన్న క్రమంలో అందులో నుంచి గిర్నిబావి, మందపల్లి, పీజీ తండాలను వేరు చేసి గిర్నిబావిని ఎంపీటీసీ స్థానంగా గుర్తించాలని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు అఖిలపక్షాలు ఏకగ్రీవ తీర్మానం చేశాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటర్లు, పోలింగ్ స్టేషన్ల డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌పై సోమవారం నిర్వహించిన సమావేశంలో ఓటర్ల, పోలింగ్ కేంద్రాల సంఖ్యను ఎంపీడీఓ అరుంధతి వివరించారు. అనంతరం తొగర్రాయి ఎంపీటీసి పరిధిలో నాలుగు వేలకుపైగా ఓటర్లు ఉన్నారని, ఈ క్రమంలో తొగర్రాయిని ఎంపీటీసీ స్థానంగా కొనసాగిస్తూనే గిర్నిబావి (980 ఓటర్లు) మందపల్లి 795, పీజీతండా 500 కలిపి గిర్నిబావి ఎంపీటీసీ స్థానంగా గుర్తించి ఓటింగ్ నిర్వహించాలని అఖిలపక్ష పార్టీల నాయకులు ప్రభుత్వాన్ని కోరుతూ ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చుక్క రమేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, బీజేపీ అధ్యక్షుడు నేదురు రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

'నా భార్య నన్ను చంపాలని చూస్తోంది'

పర్వతగిరి: 'వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకున్న నా భార్య నన్ను హతమార్చాలని చూస్తోంది, ఆమెతో నాకు ప్రాణహాని ఉంది' అని మండలంలోని సోమారం శివారు జగ్గుతండాకు చెందిన బానోతు మహేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇటీవల వినాయక చవితి అన్నదానం సందర్భంగా తనపై దాడి చేయించిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

నర్సంపేట : విద్యార్థులకు స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ భానోతు శ్రావణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని సోమవారం భిక్షాటన చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ అందక ఉన్నత చదువులకు దూరమవుతున్నారని తెలిపారు. విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు సంతోశ్, సిద్ధూ, గణేశ్, అభిలాశ్, ప్రవీణ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయి గ్రామానికి చేరిన గేదెలు

నర్సంపేట రూరల్ : తప్పిపోయిన మూడు గేదెలు నర్సంపేట మండలంలోని రాజుపేటకు చేరుకున్నాయని పంచాయతీ కార్యదర్శి సాయిరాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వంకర, పొట్టి కొమ్ములు కలిగిన మూడు గేదెలు దాదాపు నెల రోజులు గ్రామ పంచాయతీ పరిధిలో ఉంటాయని తెలిపారు. వాటి కోసం ఇంతవరకు యజమానులు రాలేదని తెలిపారు. ఈనెల 15వ తేదీలోగా సరైన ఆధారాలతో గేదెల యాజమానులు సంప్రదించని పక్షంలో ఈనెల 16న గ్రామ పంచాయతీ ఆధ్వరంలో బహిరంగ వేలం వేస్తామని స్పష్టం చేశారు. యజమానులు 15లోగా సంప్రదించాలని కోరారు.

అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించగా హైస్కూల్ ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు వేముల కిశోర్ మాట్లాడారు. నిరక్షరాస్యతను నిర్మూలించేలా, అక్షరాస్యతను పెంచేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడే ఈదునూరి రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పోలెపల్లి రవి, రజని, అనుపమ, తదితరులు పాల్గొన్నారు.
దుగ్గొండి : మండలంలోని పలు గ్రామాల్లో అక్షరాస్యత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీలు నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడారు. అక్షరాస్యత ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రామస్వామి, జ్యోతిలక్ష్మి, భద్రమ్మ, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : ర్యాలీ తీస్తున్న టీచర్లు, విద్యార్థులు

పురుగు మందు పిచికారీలో జాగ్రత్త

● సంఘం అధ్యక్షుడు ప్రకాశ్‌రావు

పర్వతగిరి : పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలని ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు ఎర్రబెల్లి ప్రకాశ్‌రావు కోరారు. మండల కేంద్రంలోని సంఘం కార్యాలయంలో మారి స్వచ్ఛంద సంస్థ పీయూ ఇన్‌చార్జ్ మూడు వెంకన్న ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ప్రకాశ్‌రావు మాట్లాడారు. రైతులందరూ వివిధ రకాల పంటలపై అనేక రకమైన పురుగు మందులు పిచికారీ చేయడం వల్ల వాటి అవశేషాలతో విషప్రభావాలకులోనై అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో బీసీఐ ప్రాజెక్టులో భాగంగా సంఘం వ్యవసాయ కూలీలకు పీపీఈ కిట్లు (షూ, ఆప్రాన్, మాస్క్, గ్లౌజ్, గాగుల్స్) అందిస్తోందని తెలిపారు. రైతులు, వ్యవసాయ కూలీలు పురుగు మందుల పిచికారీలో పీపీఈ కిట్లు ధరించాలని సూచించారు. విషప్రభావాలు శరీరం మీద పడకుండా కిట్లు దోహదపడతాయని తెలిపారు. ప్రజ్వల్ సీఈఓ పెద్దపల్లి రామ్మూర్తి మాట్లాడుతూ వ్యవసాయ కూలీలు, రైతులు బీసీఐ నిబంధనలకు లోబడి రసాయనిక ఎరువులు, ప్రత్యామ్నాయ ఎరువులైన వర్మి కంపోస్టు, సీటీ కంపోస్టులను అందిస్తున్నట్టు తెలిపారు. ఎరువులను వినియోగించుకుని నాణ్యమైన పత్తిని పండించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఎంఐఎస్ ఆఫీసర్ అక్కల రమేశ్, టెక్నికల్ ఆఫీసర్ సాధిక్ పాషా, పాలకవర్గ సభ్యులు సంపత్‌రావు, అరుణ, భద్రమ్మ, రాధిక, సిబ్బంది స్కైలాబ్, భద్రునాయక్, వేణు, యాకయ్య, అనిల్, సతీశ్, కోమల, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.



రైతుకు పీపీఈ కిట్ అందజేస్తున్న ప్రకాశ్‌రావు

విద్యుదాఘాతంతో గేదె మృతి



పర్వతగిరి : విద్యుదాఘాతానికి గురై బర్రె మృతి చెందిన ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా .. మండలంలోని చెరువుకొమ్ముతండాకు చెందిన భానోతు మంక్తి సాకుతున్న బర్రె సోమవారం ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. తనకు రూ.1.10 లక్షల నష్టం వాటిల్లిందని మంక్తి వాపోయింది. తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరింది.

నీటి గుంతలో పడి పాడిగేదె..

నర్సంపేట రూరల్ : నీటి గుంతలో పడి పాడిగేదె మృతి చెందిన ఘటన నర్సంపేట పట్టణంలోని సర్వాపురం శివారు జాలుబంధ కాల్వ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. నర్సంపేటలోని వల్లభ్‌నగర్ కాలనీ చెందిన కుక్క మూడి పద్మ-కొమ్మాలు గేదెలను పెంచుతూ పాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా మేత కోసం పట్టణ శివారులోని జాలుబంధం కాల్వ సమీపంలోకి తీసుకెళ్లగా సమీపంలోని గుంత నిండా నీళ్లు ఉండడంతో ప్రమాదవశాత్తు అందులో పడి పాడిగేదె మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.90 వేలు ఉంటుందని బాధితులు వాపోయారు.

'రోస్టర్ విధానంతో అన్యాయం'

వర్ధన్నపేట : రిజర్వేషన్‌లోని రోస్టర్ విధానంతో మాల కులస్తులకు రాష్ట్ర ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని జాతీయ మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్రె రమేశ్ తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. మాల కులస్తులను రోస్టర్ పాయింట్ 22లో చేర్చడం సరికాదన్నారు. రోస్టర్ పాయింట్‌లోని టాప్ టెన్‌లో చేర్చి రెండు రోస్టర్ పాయింట్ వచ్చేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం క్యాంపు కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాలమహానాడు వర్ధన్నపేట ఇన్‌చార్జ్ రాజ్‌కుమార్, వరంగల్ యూత్ అధ్యక్షుడు అనిల్, జిల్లా మహిళా అధ్యక్షురాలు మాధవి, జిల్లా సలహా కార్యదర్శి పాపారావు, ఐనవోలు అధ్యక్షుడు అంకుష్ రవికుమార్, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, ఆర్గనైజర్ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.


నివాళి

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని దాసరిపల్లి మాజీ ఎంపీటీసీ కోమాండ్ల రాజిరెడ్డి (50) ఆదివారం రాత్రి మృతి చెందగా ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సోమవారం నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, పార్టీ మండల అధ్యక్షుడు కత్తి కిరణ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, మండల ప్రధాన కార్యదర్శి గజ్జి రాజు, పీఏసీఎస్ చైర్మన్ బొబ్బాల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నాయకుడికి..

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు బైరెడ్డి సమ్మిరెడ్డి (73) సోమవారం గుండెపోటుతో మృతి చెందగా ఆయన మృతదేహానికి ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు పుచ్చకాయల చంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈసంపల్లి బాబు, తదితరులు నివాళులర్పించారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

నర్సంపేట: మహ్మద్ ప్రవక్త జయంతి ని పురస్కరించుకుని జామా మస్జిద్ కమిటీ, జమాలే బహార్ దర్గా కమిటీ, తాజ్ ఖుర్షీదియా యూత్ కమిటీ, ఆల్ మదీనా యూత్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని మల్లంపల్లి రోడ్డులోని జమాలే బహార్ దర్గా ప్రాంగణం నుంచి అంబేద్కర్ సెంటర్, జామే మసీద్ వరంగల్ క్రాస్ రోడ్డుకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పండ్లు, పానీయాలు పంచి పెట్టారు. అనంతరం దర్గా వద్ద ఫాతిహా, సలాం, దువా నిర్వహించి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ముస్లిమ్ మత పెద్దలు మాట్లాడారు. మహ్మద్ ప్రవక్త బోధనలను ఆచరించాలని కోరారు. కార్యక్రమంలో జామా మజీద్ కమిటీ అధ్యక్షుడు మీర్జా మసూద్ అలీ బేగ్, కార్యదర్శి షేక్ యాకూబ్, మత పెద్దలు మౌలానా షాహిద్ రజా, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం పోటెత్తిన రైతులు



దుగ్గొండి : రైతులను క్యూలో పర్యవేక్షిస్తున్న ఎస్సై రఘుపతిరెడ్డి

దుగ్గొండి : మండలంలోని మందపల్లి పీఏసీఎస్‌కు సోమవారం మధ్యాహ్నం 333 బస్తాల యూరియా రాగా రైతులు పోటెత్తారు. రైతులతో పీఏసీఎస్ ఆవరణ కిక్కిరిసిపోవడంతో సమాచారం అందుకున్న ఎస్సై రణధీర్‌రెడ్డి సిబ్బందితో చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఒక్కో రైతును వరుస క్రమంలో పంపించి యూరియా పంపిణీ చేశారు. దాదాపు సగం మందికి కూడా యూరియా అందకపోవడంతో పలువురు వేదనతో వెనుదిరిగారు. యూరియా పంపిణీని నర్సంపేట ఏడీఏ దామోదర్ రెడ్డి తనిఖీ చేశారు. నెలరోజుల క్రితం యూరియా తీసుకున్న రైతులకు మాత్రమే ఇవ్వాలన్నారు. రైతులు అవసరం లేకున్నా తీసుకెళ్లి నిల్వ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈఓలో వైజయంతి, రాజేశ్, సొసైటీ సిబ్బంది రంగు వెంకటేశ్వర్లు, రాజు, తదితరులు పాల్గొన్నారు.



నెక్కొండ : రైతు వేదిక వద్ద గుమిగూడిన రైతులు

రైతుల జాగారం

నెక్కొండ : స్థానిక రైతు వేదిక వద్ద రైతులు సోమవారం రాత్రి జాగారం చేయాల్సిన దుస్థితి నెలకొంది. మంగళవారం ఉదయం యూరియా వస్తుందని తెలిసి పలు గ్రామాల రైతులు రాత్రి 9.30 గంటల వరకు చేరుకున్నారు. ఇళ్లకు వెళితే యూరియా దొరక్కపోయే ప్రమాదం ఉందని, పంట ఎదుగుదల సమయమంటూ రైతులు జాగారానికి సిద్ధపడ్డారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం

● టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి

నెక్కొండ : ఇందిరమ్మ ఇళ్ల పథకంతో లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం వ్యక్తమవుతోందని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని అప్నా బజారులోని ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు కానుకుర్తి భాగ్యమ్మ చేపట్టిన నిర్మాణానికి సోమవారం ఆయన భూమి పూజ చేసి మంజూరు పత్రం అందజేసి మాట్లాడారు. దశలవారీగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన డబ్బు జమ చేస్తుందని తెలిపారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ఇళ్లు కూడా ఇవ్వకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. పేదల సొంతింటి కల నేరవేర్చుతున్న ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, జీపీఈఓ కార్యదర్శి సదానందం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, కోశాధికారి సుబ్బారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఈదునూరి సాయికృష్ణ, మండల యూత్ అధ్యక్షుడు సింగం ప్రశాంత్, మహిళా బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు రామారపు శిరీష, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు మంజూరు పత్రం ఇస్తున్న రంజిత్‌రెడ్డి

వ్యక్తిగత, పరిసరాల శుభ్రత కీలకం

● పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌కుమార్

దుగ్గొండి : రోగాల బారి నుంచి కాపాడుకోవడంలో వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించడం కీలకమని కేశవాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. ఆ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని రేబల్లెలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. నలుగురికి మలేరియా పరీక్షలు చేశారు. అనంతరం వైద్యాధికారి విజయ్‌కుమార్ మాట్లాడారు. అపరిశుభ్రత వల్ల దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, దోమల నివారణ చర్యలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌వీ రమాదేవి, మలేరియా సూపర్‌వైజర్ భాస్కర్, ఏఎన్‌ఎం యశోద, ఆశా కార్యకర్త హేమలత, జీపీ కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.



రోగిని పరీక్షిస్తున్న వైద్యాధికారి విజయ్‌కుమార్

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

● బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్

రాయపర్తి : స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని శ్రేణులకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నూనె అనిల్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ప్రవాస్ యోజన కార్యక్రమానికి కుమార్ హాజరై మాట్లాడారు. సాధ్యం కాని హామీలు, మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కి దాదాపు రెండేళ్లు సమీపిస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేక స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి భయపడుతోందని చెప్పారు. ఎన్నికలు ఆలస్యం కావడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎనగందుల శ్రావణ్‌కుమార్, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాపాక ప్రశాంత్, జిల్లా అధికార ప్రతినిధి పెండ్యాల గణేశ్, నాయకులు కన్నెకంటి కృష్ణారెడ్డి, గడ్డం నరేందర్, చిర్ర నాగరాజు, బద్రి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కుమార్

విజయదుందుబి మోగించాలి

నర్సంపేట : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్ కులానికి చెందిన నాయకులు నర్సంపేట నియోజకవర్గంలోని అత్యధిక స్థానాల్లో పోటీ చేసి విజయదుందుబి మోగించాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి కోరారు. పట్టణంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు జినుకల కొమ్మాలు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన డివిజన్ స్థాయి సమావేశానికి మొగిలి హాజరై మాట్లాడారు. వివిధ రాజకీయ పార్టీల నుంచి సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు రాజకీయాలకు అతీతంగా పోటీ చేయాలని, కులస్తులను గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ సెల్ రాష్ట్ర కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, నాయకుడు గోనెల నరహరి, కీసరి వెంకటేశ్వర్, నూనె నర్సయ్య, ఈర్ల నర్సింహరాములు, మండల అధ్యక్షులు పల్లె రమేశ్, దామ సాంబయ్య, అన్నెబోయిన లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని జల్లికి చెందిన నాంపల్లి నర్సయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడి బాల్య మిత్రులు సోమవారం రూ.9 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో నర్సయ్య స్నేహితులు తొగరు బుచ్చిరెడ్డి, చిలుపూరి వీరస్వామి, వల్లాజి శ్రీనివాస్, కుర్ర ప్రభాకర్, మహ్మద్ పాషా, ఇస్మాయిల్, షర్ఫుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

డీజే బాక్స్‌ల అందజేత

రాయపర్తి : మండల కేంద్రానికి చెందిన యాదవ సంఘం నాయకులకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి లేతాకుల మధూకర్‌రెడ్డి సోమవారం డీజే బాక్స్‌లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో డీజే బాక్స్‌లు అందించినట్లు తెలిపారు.